ప్రయాణం సురక్షితం

- పండగ తిరుగు ప్రయాణానికి 140 ప్రత్యేక బస్సులు
- ప్రయాణికులతో కిక్కిరిసిన అమలాపురం బస్టాండ్
- ఆర్టీసీలో సాధారణ చార్జీలే



అమలాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు



కిటకిటలాడుతున్న అమలాపురం బస్టాండ్‌లో రిజర్వేషన్ కౌంటర్

అమలాపురం రూరల్: సంక్రాంతి సెలవులకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికుల తిరుగు ప్రయాణంలో సురక్షితంగా గమ్యానికి చేరేందుకు అమలాపురం ఆర్టీసీ ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రయాణికుల సురక్షిత ప్రయాణానికి 140 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసింది. పండగ రోజులు ముగియడంతో సొంత ఊళ్లకు బయలుదేరిన ప్రయాణికులతో అమలాపురం బస్టాండ్ కిక్కిరిసింది. దాదాపు అందరూ ఒకేసారి తిరుగు ప్రయాణం కోసం బస్సు లెక్కేందుకు ఎగబడుతున్నారు. హైదరాబాద్, విశాఖ, విజయవాడ, గుంటూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లేవారు అమలాపురం బస్టాండ్‌లో రిజర్వేషన్ కౌంటర్ల వద్ద బారులు తీరారు. ఆదివారం వరకు ప్రభుత్వ సెలవులు ఉన్నా సోమవారం కార్యాలయాలకు ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు వెళ్లాల్సి ఉన్న దృష్ట్యా ముందుగా బయలుదేరారు. ఇలా వచ్చిన ప్రయాణికులతో బస్టాండ్ పోటెత్తింది. హైదరాబాద్, గుంటూరు, విజయవాడ వంటి దూర ప్రాంతాలకు ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు ప్రతి రోజూ 11 బస్సులు వెళుతుండగా రద్దీని దృష్టిలో పెట్టుకుని బుధవారం 6, గురువారం 6, శుక్రవారం 6, శనివారం 10 నుంచి 15 ఆదివారం 10 నుంచి 15 అదనపు బస్సులు ఏర్పాటు చేశారు. మొత్తం 40 బస్సులు అదనంగా నడుపుతున్నారు. విజయవాడ, విశాఖపట్టణానికి రోజుకు 15 బస్సుల చొప్పున ప్రతిరోజు అదనపు బస్సులు ఏర్పాటు చేశారు. మొత్తం విజయవాడకు 50 విశాఖపట్నానికి 50 సర్వీసులు ఏర్పాటు చేశారు. ఆదివారం వరకూ అమలాపురం నుంచి దూర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని డీఎం చల్లా సత్యనారాయణమూర్తి చెప్పారు. దూర పాంతాలకు అడిగిన ప్రతి ప్రయాణికుడికి టిక్కెట్ లేదని చెప్పకుండా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆయన తెలిపారు.

ప్రైవేటు హైటెక్ బస్సుల దోపిడీ

అమలాపురం నుంచి ప్రైవేటు హైటెక్ బస్సుల్లోనూ ప్రయాణికులు తిరుగు ప్రయాణం కోసం రూ.1800 నుంచి రూ.2వేల వరకూ కేటాయించాల్సి వస్తోంది. ఏసీ బస్సులు అయితే రూ.3500 ధర ఉంది. ముందుగా బుక్ చేసుకున్న వారికి రూ.1300 నుంచి రూ.1400 టిక్కెట్ ధర ఉంటే 18, 19 తేదీల్లో అప్పటికప్పుడు టిక్కెట్ కోసం వచ్చిన వారి నుంచి రూ.1800 నుంచి రూ.2వేల వరకూ అధిక ధరలను వసూలు చేస్తున్నారు. దీంతో ఒక కుటుంబం ప్రయాణానికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ ఖర్చు అవుతోందని ఓ ప్రయాణికుడు వాపోయాడు. ఆర్టీసీ అదనపు బస్సులో టిక్కెట్ రేట్లు తక్కువగా ఉండడంతో ప్రతి కుటుంబం సురక్షితంగా ప్రయాణం చేయవచ్చని ఆర్టీసీ డీఎం చెబుతున్నారు.

సాధారణ చార్జీలతో..

ఆర్టీసీ అదనపు బస్సుల్లో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులపై గతంలో అదనపు వడ్డన పడేది. ఆర్టీసీని సీఎం జగన్ ప్రభుత్వం పాలనలో ప్రభుత్వలో ఆర్టీసీని విలీనం చేసిన అనంతరం అదనపు చార్జి వసూలను రద్దు చేశారు.

అప్పటి నుంచి ఈ విధానమే అమలవుతుందని డీఎం తెలిపారు సాధారణ రోజుల్లో మాదిరిగానే సంక్రాంతి ప్రత్యేక హైదరాబాద్‌కు సూపర్‌లగ్జరీలో రూ.900 అల్ట్రా డీలక్స్ రూ రూ.860, ఏసీ 1140, ఎక్స్‌ప్రెస్ రూ.700 టిక్కెట్ల ధర ఉందన్నారు.

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు కార్తీక్, శంకరరావు, యూనియన్ సభ్యుడు సుబ్బారావు

అమలాపురం టౌన్: ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 2025 నూతన సంవత్సరానికి ముద్రించిన క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం జరిగింది. ఆ యూనియన్ అమలాపురం శాఖ ప్రతినిధి, రాష్ట్ర కార్యదర్శి పీవీవీ సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ కార్తీక్, ఏరియాథులుగా పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ కార్తీక్, డాక్టర్ శంకరరావు క్యాలెండర్లను ఆవిష్కరించారు. మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ వైద్య ఉద్యోగుల సంక్షేమానికే కాకుండా ఇలా క్యాలెండర్లు పూర్తి సమాచారంతో ముద్రించి సామాజిక సేవలు కూడా అందిస్తోందని కార్తీక్, శంకరరావు అన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులైన వివిధ కేటగిరీల్లోని వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ జెండా రెపరెపలు



అమలాపురం గడియారం స్తంభం వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండా

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ ల్యాండ్ మార్కు అయిన గడియారం స్తంభం ఎత్తుకు తగినట్లుగా ఓ పోల్‌కు నిత్యం జాతీయ జెండా సగర్వంగా ఎగిరేది. కొన్నేళ్లుగా ఆ పోల్‌పై జాతీయ జెండా ఎగరడం లేదు. ఆ జెండా కూడా కనిపించడం లేదు. దీంతో ఆ స్తంభంపై గతంలో మాదిరిగా ఎప్పటిలాగే జాతీయ జెండా 365 రోజులూ ఎగిరేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజుకు విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ప్రతనిధులు వినతిపత్రం అందించారు. దీనికి స్పందించిన మున్సిపాలిటీ గడియారం స్తంభం పోల్‌పై జాతీయ జెండా ఎగిరేలా చర్యలు చేపట్టింది. కొన్నేళ్ల తర్వాత ఆ స్తంభానికి ఉన్న జెండాను చూసి కోనసీమ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జెండాను పునః ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్ రాజుకు విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

12వ పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించాలి

ముమ్మిడివరం: 12వ పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించాలని, కమిటీ నియమించే లోపు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏపీటీఎఫ్(ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) విస్తృత స్థాయి సమావేశం డిమాండ్ చేసింది. ముమ్మిడివరంలో జిల్లా కార్యాలయంలో శుక్రవారం అధ్యక్షుడు ఎస్ఎస్ మున్నేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. జిల్లాలో స్టడీ లీవు పొందిన ఎస్సీ, ఎస్టీలకు ఆన్ డ్యూటీ సౌకర్యంలో ఉన్న ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్ వెంటనే మంజూరు చేయాలని, గుర్తింపు పొందిన యూనియన్లకు ఉపాధ్యాయ సమస్యలపై కోఆర్డినేషన్ మీటింగ్ కండక్ట చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిని కోరుతూ సమవేశం తీర్మానించింది. ఉపాధ్యాయ సమస్యల సాధన కోసం ఎవరైనా ముమ్మిడివరంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యాలయంలో సంప్రదించ వచ్చునని జిల్లా అధ్యక్షుడు మున్నేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర కౌన్సిలర్ జీవీవీ సత్యనారాయణ సంఘ నిర్మాణం కోసం పలు సూచనలు చేశారు. గౌరవాధ్యక్షుడు ఎల్.నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి యూవీ వెంకటరావు, గుత్తాల వెంకటేశ్వరరావు, మోర్త రాజశేఖర్, మడికి నాగభూషణం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలలో నలుగురికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కోరంగి వంతెన దిగువన పటవల వైపు శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. కాకినాడ వైపు వెళుతున్న రెండు ద్విచక్ర వాహనాలను ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారి ఉమకా వెంకటేశ్వరరావుకు తలపై తీవ్రగాయమైంది. అతనిని స్థానికులు కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. మరొక వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా మరో ప్రమాదంలో కేశవస్వామి కాలనీ వద్ద అమలాపురం నుంచి వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో తాళ్లరేవుకు చెందిన బూలా శశికుమార్, చల్లా సత్యలోకేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. కోరంగి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారు డ్రైవర్ షేక్ సలీంను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

పరీక్ష అట్టలపై పెళ్లి శుభలేఖ



ఎగ్జామ్ ప్యాడ్‌పై ముద్రించిన పెళ్లి శుభలేఖ, ఏడు వారాల దేవుళ్ల ప్రత్యేకతలు

అమలాపురం టౌన్: పెళ్లిళ్ల సమయంలో వివాహ ఆహ్వాన పత్రికల (శుభలేఖలు)ను ఇటీవల వినూత్నంగా ముద్రిస్తున్నారు. శుభ లేఖల ముద్రణలో కొందరు కొత్త పుంతలు తొక్కుతున్న క్రమంలో అమలాపురం పట్టణంలోని బుక్ సెంటర్ యాజమాని కంచర్ల సాయి ఈనెల 31న జరగనున్న తన కుమారుడి వివాహ శుభలేఖను పరీక్ష అట్టలపై ముద్రించి అందరికీ ఇచ్చి ఆహ్వానిస్తున్నారు. ప్యాడ్ ముందు భాగంలో వధూవరుల పేర్లు, ముహూర్తం, కళ్యాణ వేదిక, విందు, ఆహ్వానిస్తున్న వారి పేర్లు తదితర వివరాలను ముద్రించారు. ప్యాడ్ వెనుక వారం రోజుల్లో ఏయే రోజు ఏ దేవుడి ప్రత్యేకత, భక్తులు అనుచరించాల్సిన మార్గాలను సూచిస్తూ ముద్రించారు. శుభ లేఖలు పంచి ఆహ్వానించడం, వివాహం అయ్యాక వాటిని ఓ మూలన పడేయడం జరుగుతోందని, మా ఇంటి శుభలేక కొన్నాళ్లపాటు వారికి ఉపయుక్తంగా ఉండాలన్న ఉద్దేశంతో ఇలా ఎగ్జామ్ ప్యాడ్‌లపై శుభలేఖను ముద్రించి అందర్నీ ఆహ్వానిస్తున్నానని సాయి చెప్పారు. ఎంత ఖరీదు పెట్టి శుభలేఖలను ముద్రించినా పెళ్లి అయ్యాక నిరుపయోగమవుతున్న క్రమంలో పరీక్ష అట్టలపై ముద్రణతో ఉపయోగపడాలని ఇలా ప్రయత్నించానని పేర్కొన్నారు. సాయి దంపతులు ఎగ్జామ్ ప్యాడ్‌ల శుభలేఖలతో బంధువుల, స్నేహితుల ఇళ్లకు వెళ్లి ఆహ్వానిస్తున్నప్పుడు తీసుకున్న వారంతా ఇదోదే వినూత్నంగా ఉందని చెబుతూ ఆనందం వ్యక్తం చేయడం తమ ప్రయత్నాన్ని అభినందిస్తున్నట్టుగానే భావించామని సాయి దంపతులు అంటున్నారు.

శ్రీనుబాబు మృతి తీరని లోటు



బలుసుతిప్పలో మాజీ సర్పంచి శ్రీనుబాబు పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ తదితరులు

కాట్రేనికోన: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, బ్రహ్మ సమేత్యం మాజీ సర్పంచ్ ఇసుకపట్ల శ్రీనుబాబు కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఊరు కన్నీరు పెట్టింది. ఆయనకు భార్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. యువకుడు, విద్యావంతుడు అయిన శ్రీనుబాబు గ్రామస్తులతో కలిసిమెలసి ఉండేవాడు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా పరిష్కరించేవారు. గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. శ్రీనుబాబు మృతి బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులను కలచివేసింది.

ముందుగా శ్రీనుబాబు పార్థివ దేహాన్ని కాట్రేనికోన గేటు నుంచి గెద్దనపల్లి, దొంతికుర్రు, కందికుప్ప, పల్లంకుర్రు, సాపేవారిపేట, బూలవారిపేట, గొల్లగరువు, రామాలయం పేట, గ్రామాల మీదుగా వందలాది మంది అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో బైక్ ర్యాలీగా అంతిమ యాత్ర సాగింది. శ్రీనుబాబు అంత్యక్రియలు బలుసుతిప్ప శ్మశాన వాటికలో జరిగాయి. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, జెడ్పీటీసీ నేల కిషోర్, ఎంపీపీ పాలెపు లక్ష్మీ ధర్మారావు, నల్లా నరసింహమూర్తి, నాతి సత్యనారాయణ, అలివేణి, మల్లాడి ఆదినారాయణ, ఏడుకొండలు, బర్రే రాంబాబు తదతరులు నివాళులు అర్పించారు. శ్రీనుబాబు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పత్రికా ప్రకటనలో తెలిపారు.

చిక్కం కుటుంబీకుల ఆత్మీయ కలయిక



ఉప్పలగుప్తంలో సమావేశమైన చిక్కం కుటుంబీకులు

ఉప్పలగుప్తం: గ్రామంలో చిక్కం ఇంటి పేరుతో ఉన్న వారు అధికంగా ఉండడంతో వారి వంశీయుల ఆత్మీయ కలయిక చతుర్ధ సమ్మేళన సభను శుక్రవారం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చిక్కం కుటుంబీకులంతా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారంతా కుటుంబ సభ్యులతో సందడి చేస్తూ ఆడి, పాడి, విందు వినోదాలను ఆరగించారు. వారి కుటుంబంలో ఉన్నతమైన స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్న వారిని గుర్తించి ఘన సత్కరించారు. వారి వంశీయుల్లో ఉన్నత చదువులకు ఆర్థిక స్తోమతలేని వారిని, ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడే వారిని గుర్తించి వారికి ఆర్థిక సహకారం అందిస్తామని తీర్మానించుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

ముమ్మిడివరం: ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో సాగిస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళుతోందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి రాజుపాలెంలో శుక్రవారం గోదశి పుండరీష్ అధ్యక్షతన జరిగిన నియోజక వర్గ జనసేన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాలలో పార్టీ ఇన్‌చార్జిలు లేకపోయిన అక్కడ కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాలు సాధించారన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో కార్యకర్తలు పార్టీని బలోపేతం చేయాలన్నారు. అనంతరం జగతా చంటి, పోలిశెట్టి బ్రహ్మాజీల ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాలో జనసేన పార్టీ నుంచి ఎన్నికైన నీటి సంఘం అధ్యక్షుడు, సొసైటీ అధ్యక్షుడు డైరెక్టర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూడల స్వామి, కర్రా దుర్గాప్రసాద్, మోకా బాలరాజు, పోలిశెట్టి కృష్ణ, మాదాల శ్రీధర్, గాలిదేవర బుల్లి, మెండ శివ, జగతా సతీష్ పాల్గొన్నారు.

వాహనచోదకులకు హెల్మెట్ తప్పనిసరి



రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న డీటీఓ శ్రీనివాసరావు

అమలాపురం రూరల్: విద్యార్థులకు వాహనం నడిపేటపుడు హెల్మెట్ ధరణ ప్రాధాన్యమివ్వలని జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు సూచించారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు సందర్భంగా అమలాపురం కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రమాదల నివారణపై అవగహన కల్పించారు. అదేవిధంగా డ్రైవింగ్ ట్రాక్ వద్ద పరీక్షకు వచ్చిన అభ్యర్థులకు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదలు నుంచి ప్రాణాలను ఎలా కాపాడుకోవచ్చు అనే అంశంపై మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కేఆర్ రవికుమార్, జ్యోతి సురేష్, కాశీ విశ్వేశ్వరరావు అవగాహన కల్పించారు.

ఘనంగా గంధోత్సవం



అమలాపురంలో గంధాన్ని ఊరేగిస్తున్న షియా ముస్లింలు

అమలాపురం టౌన్: షియా ముస్లిం మతస్తుల ఆరాధ్య దైవ దూత మహ్మద్ ప్రవక్త తమ్ముడు ఇమామ్ అలీ 1425వ జన్మదిన వేడుకలను పట్టణంలోని ఆ మతస్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక 12వ వార్డులోని అస్తానే అబ్బాస్ ఏ పంజా వద్ద ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఇమామ్ అలీ గంధోత్సవాన్ని షియా ముస్లింలు నెత్తిన పెట్టుకుని పట్టణంలో ఊరేగుతూ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని షియాలే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆ మతస్తులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. ముస్లిం వీధి, ఖాజా బాబా దర్గా, తటవర్తి వారి వీధి, ముమ్మిడివరం గేటు సెంటరు మీదుగా అలీ కరీముల్లా షా దర్గా వరకూ ఊరేగింపు సాగింది. షియాలు భక్తి గీతాలు పాడుతూ నారే హైదరి నినాదాలతో గంధోత్సవాన్ని నిర్వహించారు. ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. పంజా ధర్మకర్త మహ్మద్ నిసార్ హుస్సేన్, కార్యదర్శి కర్రర్ హుస్సేన్ పర్యవేక్షణలో గంధోత్సవం, ఊరేగింపు జరిగింది.

క్రికెట్ టోర్నీ విజేత కొండుకుదురు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు

ఐ.పోలవరం: బాబూ జగ్జీవన్‌రామ్ క్రికెట్ టోర్నీ విజేతగా కొండుకుదురు జట్టు నిలిచింది. సంక్రాంతి సందర్భంగా డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ క్రికెట్ టోర్నమెంట్‌ను కొమరగిరిలో నిర్వహించారు. మొత్తం పది జట్లు పాల్గొనగా శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కొత్త మురమళ్ళ మీద విజయం సాధించిన కొండుకుదురు జట్టు టోర్నీ విజేతగా నిలిచింది. విజేతలకు మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఉందుర్తి వీర వెంకట రావు, ప్రతినిధులు వీధి రాజశేఖర్, లక్కవరపు రాజశేఖర్, వీధి వెంకటేశ్వరరావు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు నటువంటి ముందుటి వీర వెంకట రావు బహుమతులు అందజేశారు. టోర్నీ నిర్వహకులు సవరపు శేఖర్, ఆకుమర్తి రాజేష్, వీధి విజయ్, ఈతకోట సంతోష రావు తదితరులను పలువురు అభినందించారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

అల్లవరం: దీర్ఘకాలికంగా ఉన్న భూ సంబంధిత సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆర్డీఓ కె.మాధవి అన్నారు. ఎంట్రుకోన సచివాలయం వద్ద తహసీల్దార్ వీవీఎల్ నరసింహరావు ఆధ్వర్యంలో శుక్రవారం రీ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాధవి మాట్లాడుతూ ఎంట్రుకోన గ్రామాన్ని రీ సర్వే చేయడానికి పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేశారు. వందేళ్లుగా ఉన్న రెవెన్యూ రికార్డులను నవీనకరించడం, ప్రస్తుత భూస్థితి తదితర విషయాలపై ఆర్డీఓ అవగాహన కల్పించారు. రీ సర్వే చేయడానికి వీఆర్వోలు, సర్వేయర్లు బృందాలుగా ఎర్పడి రైతుల సమక్షంలో భూమికి సరిహద్దులు నిర్ణయించామన్నారు. సర్పంచ్ టి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అభయారణ్యానికి సందర్శకులు



అభయారణ్యంలో పిల్లి బొమ్మ వద్ద సెల్ఫీ తీసుకుంటున్న సందర్శకులు



కోరింగా అభయారణ్యంలో సందర్శకుల తాకిడి



గోదావరిలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

- కిక్కిరిసిన కోరంగి అడవులు
- ఉత్సాహంగా బోటు షికార్
- సెల్ఫీలతో సందడి

తాళ్లరేవు: తూర్పున ప్రముఖ పర్యాటక ప్రదేశమైన కోరంగి అభయారణ్యానికి సందర్శకుల తాకిడి ఎక్కువైంది. సంక్రాంతి పండగ సందర్భంగా గత వారం రోజులుగా అభయారణ్యం సందర్శకులు, పర్యాటకులతో కిక్కిరిసింది. జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పండగకు వచ్చిన అనేక మంది అధిక సంఖ్యలో కుటుంబ సమేతంగా తరలివచ్చి ఆట పాటలతో సందడిగా గడిపారు. సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అభయారణ్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల బొమ్మలతోపాటు ప్రకృతి అందాలు, సుందర దృశ్యాలను సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు. ఉత్సాహంగా బోటు షికార్ చేస్తూ ఆనందాన్ని పొందుతున్నారు. అభయారణ్యంలో ఏర్పాటు చేసిన నేచర్ షాప్ అందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ షాప్‌లో అభయారణ్యంలోని పలు పక్షులు, చెట్లు, ఇతర జంతువులతో కూడిన టీషర్ట్‌లు తదితర వస్తువులను విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు సందర్శకులు ఆసక్తి చూపిస్తున్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో రోజుకు సుమారు ఆరు నుంచి ఏడు వేల మంది సందర్శిస్తున్నారు. గత పది రోజుల్లో సుమారు 50 వేల మంది అభయారణ్యాన్ని సందర్శించినట్టు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సిద్ధార్థ తెలిపారు.

ముంపు ప్రభావిత గ్రామాల పరిశీలన

శ్యాంప్‌లో పూడిక తీతకు రూ.4.5 కోట్ల నిధులకు ప్రతిపాదనలు



మొగళ్లమూరులోని లోయర్ కౌశిక ఫీల్డ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి, అధికారులు

అల్లవరం: మండలంలోని లోయర్ కౌశిక పరిధిలో ముంపు ప్రభావిత గ్రామాలను ఆర్డీఓ కె.మాధవి శుక్రవారం పరిశీలించారు. మొగళ్ళమూరులోని లోయర్ కౌశికని స్టాటింగ్ పాయింట్ నుంచి ఎన్.రామేశ్వరంలోని శ్యాంప్ ముగింపు పాయింట్ వరకు డ్రైన్ల ఏఈ సునీతాదేవితో కలిసి ఆర్డీఓ మాధవి పరిశీలించారు. ముంపు ఏర్పడే కారణాలను తెలుసుకొని నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించినట్టు ఆమె తెలిపారు. అల్లవరం, రెల్లుగడ్డ, గోడిలంక, తూర్పులంక, దేవగుప్తం, గుండెపూడి తదితర గ్రామాల్లో ఏటా ముంపు పాలైతున్నాయని డ్రైన్ ఏఈ తెలిపారు. ముంపు నీరు నిల్వ ఉంటే శ్యాంప్‌లో భారీగా పూడిక చేరడంతో ముంపు నీరు స్తంభిస్తుందన్నారు. ఎన్.రామేశ్వరం బ్రిడ్జి నుంచి మొగ సముద్రంలోకి కలిసే సీ మౌత్ వరకు డ్రెడ్జింగ్ చేసి పూడికను తొలగించాలని ఆర్డీఓకి ఏఈ తెలిపారు. దీనికి రూ.4.5 కోట్లు నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించామన్నారు. శ్యాంపులో డ్రెడ్జింగ్ నిర్వహించి పూడిక తొలగిస్తే ముంపునకు పరిష్కారం లభిస్తుందని ఆర్డీఓకి సూచించారు. దీనిపై ఆర్డీఓ మాధవి స్పందిస్తూ ముంపుపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని డ్రెయిన్ అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ వీవీఎల్ నరసింహరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన కార్మిక సంఘం నాయకులు



సీఎండీ పృథ్వీతేజ్‌ను సత్కరిస్తున్న తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నాయకులు

అమలాపురం రూరల్: ఈపీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ బొబ్బ రవీంద్ర, సీఎండీ పృథ్వీతేజ్‌ను తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నాయకులు కలుసుకున్నారు. తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు భారతి వెంకటేశ్వరావు, జిల్లా కార్యదర్శి గణేష్, డివిజన్ కార్యదర్శి మోహన్ బాబు, జిల్లా గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ సభ్యులు శుక్రవారం విశాఖపట్నంలో సీఎం డి.పృథ్వీతేజ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి 2025 నూతన డైరీని కలిసి అందించారు.

జాతీయస్థాయి పోటీలకు సాయ్ క్రీడాకారుడి ఎంపిక




నేషనల్‌గేమ్స్‌కు ఎంపికైన ప్రేమ్‌కుమార్‌తో కోచ్‌లు ఉదయ్‌కుమార్, రవితేజ

యానాం: డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) యానాం శాఖలో శిక్షణ పొందుతున్న క్రీడాకారుడు జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్టు సెంటర్ ఇన్‌చార్జి ఎస్.ఉదయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పెనుపోతు ప్రేమ్‌కుమార్ ఈనెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో హల్ద్వానిలో జరిగే నేషనల్ గేమ్స్‌లో భాగంగా నిర్వహించే 50 మీటర్ల ఫ్రీస్టైల్(ఫాస్టెస్ట్ ఈవెంట్)కు పుదుచ్చేరి తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ప్రేమ్‌కుమార్ ఇప్పటికే స్విమ్మింగ్ కోచ్‌లు ఉదయకుమార్, రవితేజ గ్రంధి ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

యానాం: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చునని ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు పేర్కొన్నారు. శుక్రవారం యువజన వ్యవహారాలు శాఖ, నెహ్రూయువకేంద్రం ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతావారోత్సవాల్లో భాగంగా యువతీ, యువకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిగ్నల్స్, నిబంధనలు తదితర వాటిపై తెలియజేసి నెహ్రూయువకేంద్ర వలంటీర్లకు టీషర్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి గోపి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కృష్ణసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సుకు హాజరైన యువకులు